జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

శనివారం 31 అక్టోబర్ 2026 పేజీలు:14

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో సి.ఎన్.ఆర్ పాఠశాల విద్యార్థి ప్రతిభ

- పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించిన జ్ఞానేశ్వర్

- అభినందించిన పాఠశాల యాజమాన్యం

నాగర్ కర్నూల్ : అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీలో సి.ఎన్.ఆర్ పాఠశాల 9వ,తరగతి విద్యార్థి జ్ఞానేశ్వర్ ప్రతిభ చాటి,ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు.

మిగతా 2 లో

ఎల్‌నినో ముప్పు.. తాగునీటి ఎద్దడిపై ముందస్తు కార్యాచరణ.!

- వచ్చే 8 నెలలు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

-- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి బ్యూరో):

రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో కరువు, నీటి కొరత పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధ్యక్షతన కలెక్టరేట్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో తాగునీటి సరఫరా, విద్యుత్, నీటి వనరుల లభ్యత, వి.బి.జి. రామ్ జీ పనులపై అధికారులతో సమీక్షించారు.

మిగతా 2 లో

ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా

రోడ్డు భద్రత చర్యలు

- రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను వెంటనే తొలగించాలి
- ఎస్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి
- పీఎం రాహత్ పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్ అక్టోబర్ 30(ప్రజా జ్యోతి బ్యూరో)

జిల్లాలో ప్రజల ప్రాణాలను కాపాడడమే ప్రధాన లక్ష్యంగా రోడ్డు భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని, రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.

మిగతా 2 లో

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారమే.!

- విద్యార్థులపై కేసులు.. కఠిన చర్యలు తప్పవు- సీనియర్లు జూనియర్లకు మార్గదర్శకులుగా ఉండాలి.. భయపెట్టే వారిగా కాదు: జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి బ్యూరో):

"సీనియారిటీ అంటే ఆధిపత్యం కాదు.. జూనియర్లకు అండగా నిలవడమే నిజమైన సీనియారిటీ.!" అని విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు తావులేదని, స్నేహం ముసుగులో తోటి విద్యార్థులను వేధిస్తే సహించేది లేదని జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఐపీఎస్ హెచ్చరించారు.

మిగతా 2 లో

ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా రోడ్డు భద్రత చర్యలు

మొదటిపేజీ తరువాయి

శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ........ రోడ్డు ప్రమాదాల నివారణకు కేవలం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం సరిపోదని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. పోలీస్, రవాణా, రోడ్లు మరియు భవనాలు, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులు, రహదారి సూచికలు, వేగ నియంత్రణ ఏర్పాట్లు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరగకుండా రహదారులపై తగిన వెలుతురు, స్పష్టమైన హెచ్చరిక సూచికలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం, వాహనాలను నిలిపి ఉంచడం వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి ఆక్రమణల వల్ల ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు.ముఖ్యంగా ఎస్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ఉన్న రహదారిపై ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని, పట్టణంలోని ఇతర ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను కూడా తొలగించి పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాద బాధితులను సమీప ఆసుపత్రులకు తరలించేందుకు ప్రజలు ముందుకు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.ఈ విషయంలో పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందేలా చూడాలని ఆదేశించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. చేపట్టిన చర్యల అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రోడ్డు భద్రతా నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారమే.!

మొదటిపేజీ తరువాయి

ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులపై కళాశాల స్థాయిలో క్రమశిక్షణా చర్యలతో పాటు, నేర స్వభావాన్ని బట్టి పోలీసు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని ఎస్.వి.ఎస్. డెంటల్ కాలేజీలో మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన పరిణామాలు, విద్యార్థుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైనదని, ముఖ్యంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న వారు క్రమశిక్షణ, మానవత్వం, సేవాభావం, పరస్పర గౌరవం వంటి విలువలను అలవర్చుకోవాలని ఎస్పీ సూచించారు. సీనియర్లు జూనియర్లకు మార్గదర్శకులుగా నిలవాలే తప్ప, వారిని భయపెట్టడం, అవమానించడం, బలవంతంగా పనులు చేయించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడకూడదన్నారు. పరిచయాలు పెంచుకోవడం, స్నేహపూర్వకంగా మాట్లాడటం, చదువులో సహకరించడం మంచి సంప్రదాయమని, అయితే ఆ పేరుతో హద్దులు దాటి ఇతరులను మానసికంగా, శారీరకంగా వేధించడం ర్యాగింగ్ కిందకే వస్తుందని వివరించారు. ర్యాగింగ్ కారణంగా బాధిత విద్యార్థుల్లో భయం, ఆత్మన్యూనతాభావం, మానసిక ఒత్తిడి ఏర్పడి వారి చదువుతో పాటు భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారణ అయితే సస్పెన్షన్, పరీక్షలకు అనర్హత, హాస్టల్ నుంచి తొలగింపు, జరిమానా, కళాశాల నుంచి బహిష్కరణ వంటి చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దాడులు, బెదిరింపులు, వేధింపులకు పాల్పడితే సంబంధిత చట్టాల ప్రకారం పోలీసు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్‌కు గురైతే భయపడకుండా వెంటనే కళాశాల యాజమాన్యం, యాంటీ ర్యాగింగ్ కమిటీ లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించడం లేదా జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరించడం కూడా బాధ్యతారాహిత్యమేనన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి మంచి వైద్యులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.ర్యాగింగ్ రహిత విద్యాసంస్థల నిర్మాణం అందరి బాధ్యత అని, స్నేహం, సహకారం, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణాన్ని కల్పించడంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్.వి.ఎస్. ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ చైర్మన్ కె.వెంకట్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మునిశేఖర్, అడ్వకేట్ రవికుమార్ యాదవ్, అధ్యాపకులు, మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులు కలిపి సుమారు 200 మంది పాల్గొన్నారు.

ఎల్‌నినో ముప్పు.. తాగునీటి ఎద్దడిపై ముందస్తు కార్యాచరణ.!

మొదటిపేజీ తరువాయి

రాబోయే ఎనిమిది నెలలు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నీటి ఎద్దడి ఎదురయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన చోట ట్యాంకర్లు, బోర్లు, మోటార్లు, పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సంరక్షణకు సోక్‌పిట్లు, రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని, నీరు, విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని, నీటి వృథాను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, నగర మేయర్ గుమ్మల మమత , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో సి.ఎన్.ఆర్ పాఠశాల విద్యార్థి ప్రతిభ

మొదటిపేజీ తరువాయి

విద్యార్థి విజయం పట్ల పాఠశాల వ్యవ స్థాపకులు చంద్రకళ,ప్రిన్సిపాల్ హాజిరా,అపర్ణ,పాఠశాల యాజ మాన్యం సయ్యద్ ఫసియుద్దీన్,వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆనంద్, సత్య నారాయణ,ఉపాధ్యాయు లు జ్ఞానేశ్వర్ ను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పుల్గర్‌చర్లలో తీరని విషాదం.. ఒకరి వెంట ఒకరు మృతి!

- భర్త అంత్యక్రియలు ముగిసిన మరుసటి రోజే భార్య కన్నుమూత..

కీర్తి, చంటి జీవితాల్లో తీరని విషాదం!

వీపనగండ్ల, ప్రజాజ్యోతి రిపోర్టర్:

మండల పరిధిలోని పుల్గర్‌చర్ల గ్రామంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ఎంతో అన్యోన్యంగా కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా జీవించిన భార్యాభర్తలు ఒక్కరోజు వ్యవధిలోనే మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.గ్రామానికి చెందిన చాకలి నిరంజన్ గురువారం గుండెపోటుతో మృతి చెందారు. భర్త మరణవార్తతో భార్య మొగులమ్మ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. గురువారం భర్త అంత్యక్రియలు పూర్తయిన అనంతరం అదే రోజు రాత్రి మొగులమ్మ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే విధి మరోలా తలచడంతో శుక్రవారం ఉదయం మొగులమ్మ కన్నుమూశారు.ఒకరి మరణాన్ని మరొకరు తట్టుకోలేనంత అనుబంధంతో జీవించిన దంపతులు ఇలా ఒకరి వెంట ఒకరు మృత్యువాత పడటం కుటుంబ సభ్యులను, బంధువులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. వీరికి కీర్తి అనే కుమార్తె, చంటి అనే కుమారుడు ఉన్నారు. విధి ఆడిన వింత నాటకంలో ఒక్కరోజు వ్యవధిలోనే తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయి కీర్తి, చంటి అనాథలుగా మిగిలారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న తల్లిదండ్రులు ఇద్దరూ దూరం కావడంతో పిల్లల పరిస్థితి తలచుకుని గ్రామస్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ విషాద ఘటన పుల్గర్‌చర్ల గ్రామంలో ప్రతి ఒక్కరినీ కలచివేసింది.

ఎంబిబిఎస్ సీట్ సాధించిన విద్యార్థికి సన్మానం.డాక్టర్.ప్రేమ్ కుమార్

గద్వాల (ప్రజా జ్యోతి) అక్టోబర్ 30;

మారుమూల గ్రామం శెట్టి ఆత్మకూరు జోగులాంబ గద్వాల జిల్లా కు చెందిన నారాయణ మాణిక్యమ్మ దంపతులకు జన్మించిన దీపిక.కరీంనగర్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించడం గ్రామానికే గర్వకారణం అని సామాజిక విప్లవకారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు.గవర్నమెంట్ స్కూల్ మరియు గవర్నమెంట్ కాలేజీ లో చదివి కష్టపడి సీటు సాధించిన దీపిక గద్వాల జిల్లా విద్యార్థులకు ఆదర్శం అని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. వ్యవసాయ కూలి చేస్తున్న తల్లి తండ్రుల సహాయంతో ఎంతో శ్రమించి సాధించి. అంతే కాక ఆమె భవిష్యత్ లో డాక్టర్ విద్యను పూర్తి చేసుకొని పేద ప్రజలకు వైద్య సేవలను అందించాలని ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఎంబిబిఎస్ సీటు సాధించిన ఆమెను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తంగా నిలిచే ఆపదమిత్రులుగా 103 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ -- 10వ

ఇటిక్యాల,ఎర్రవల్లి (ప్రజాజ్యోతి) అక్టోబర్ 30:

10 వ బెటాలియన్‌లో రెండో విడత ఏడు రోజుల ఆపదమిత్ర శిక్షణ కార్యక్రమం ఆపద సమయంలో ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావడం కంటే గొప్ప సేవ మరొకటి లేదు.ఇలాంటి అరుదైన సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావడం మీ అందరి అదృష్టం.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమాజానికి సేవ చేసే ఆపదమిత్రులుగా ఎదగాలి -- కమాండెంట్ టి.అలెక్స్.10వ బెటాలియన్‌లో తెలంగాణ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఎస్ డి ఆర్ ఎఫ్ మరియు మహబూబ్‌నగర్ జిల్లా వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత ఏడు రోజుల ఆపదమిత్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం నేషనల్ సర్వీస్ స్కీమ్ ఎన్ ఎస్ ఎస్ మరియు నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఎన్ వై కే ఎస్ సంస్థలకు చెందిన మొత్తం 103 మంది విద్యార్థులు పాల్గొని ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు.ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు, తుఫానులు,పేలుళ్లు, భవనాలు కూలిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించగల సేవాభావం కలిగిన ఆపదమిత్రులను తయారుచేయడం. అత్యవసర సేవా బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు బాధితులకు ప్రాథమిక సహాయం,ప్రథమ చికిత్స అందించడం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి సేవలను అందించే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.ఈ ఏడు రోజుల శిక్షణలో భాగంగా అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,వరదలు మరియు తుఫానుల సమయంలో రక్షణ చర్యలు,భవనాలు కూలిపోయినప్పుడు బాధితులను రక్షించే విధానాలు,ప్రాథమిక వైద్య సహాయం, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షితంగా తరలించడం వంటి అంశాలపై నిపుణులచే ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నారు.అదేవిధంగా ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు విపత్తుల సమయంలో ఉపయోగించే ఆధునిక రక్షణ పరికరాలు, రెస్క్యూ టూల్స్, అత్యవసర సహాయక సామగ్రి మరియు వాటి వినియోగ విధానాలపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు.తద్వారా విపత్తు సమయంలో భయపడకుండా,సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందించేలా వారిని తీర్చిదిద్దుతున్నారు.ఈ కార్యక్రమం 10వ బెటాలియన్ కమాండెంట్ టి.అలెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా కమాండెంట్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ,సమాజానికి సేవ

చేసే ఇలాంటి బృహత్తర కార్యక్రమంలో పాల్గొనే అవకాశం అందరికీ లభించదని,ఇది మీకు దక్కిన గొప్ప అదృష్టమని పేర్కొన్నారు. ఆపద సమయంలో ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావడం ఎంతో గొప్ప సేవ అని, ఈ ఏడు రోజుల శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని సూచించారు.ఆపదమిత్రులుగా శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి.ఆదినారాయణ, అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీ పార్థసారథి రెడ్డి, శ్రీను,బెటాలియన్ ఇన్‌స్పెక్టర్లు,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, నరసింహరాజు, రాజేశం,తిరుపతి తదితర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా ఎమ్మెల్సీ ఓటరు నమోదు పూర్తి చేయాలి బీజేపీ మండల అధ్యక్షులు నల్లె నర్సప్ప, మాజీ అధ్యక్షులు జి శ్రీనివాసులు

కృష్ణా అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి)

కృష్ణా మండల కేంద్రం లో వేంకటేశ్వర స్వామీ దేవాలయంలో శక్తి కేంద్రం ఇంచర్జీలు, మండల ముఖ్య నాయకుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు పై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశన్ని ఉద్దేశించి మాట్లాడిన మండల అధ్యక్షులు నల్లె నర్సప్ప, మాజీ అధ్యక్షులు జి శ్రీనివాసులు గత నెల రోజులు గా కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించి ముఖ్య నాయకులు నవంబర్ 6 లోగా గడువు ముగిసే లోగా గతంలో ఓటు ఉన్న వారిని మరియు కొత్తగా 2023 నవంబర్ నాటికి డిగ్రీ పట్టభద్రులు మరియు తత్సమాన అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లను ప్రత్యేకంగా కలిసి ఓటు నమోదు చేయించాలని జాతీయ, రాష్ట్ర పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతుందని అదే విధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం పై విద్యావంతులు, మేధావులు ఉపాధ్యాయ ఉద్యోగులు నిరుద్యోగ పట్టభద్రులు కాంగ్రెస్ కు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని. ప్రతి ఒక్కరినీ ఓటరు నమోదు చేయించాలని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు డి రాఘవేంద్ర, సచిన్ బట్, సీనియర్ నాయకులు నారాయణ బట్ ,శంకరయ్య శెట్టి, బి శంక్రప్ప జెంసెర్ నరసింగప్ప, గుంతల హన్మంత్రయ, సురేష్ బట్,సాబుగౌడ్, కుర్వ బాలరాజు, కంద్రయ రాజు, కావలి బస్వరాజు, నాగేంద్ర, తిరుపతి, బీరప్ప, అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఓటరు నీ నమోదు చేయించాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి,స్పోర్ట్స్ అథారిటీ

మాజీ చైర్మన్ డా.అంజనేయ గౌడ్ - మాజీ జడ్పీటీసీ, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

- బాసు శ్యామల హనుమంతు నాయుడు

గద్వాల (ప్రజా జ్యోతి) అక్టోబర్ 30:

గద్వాల నియోజకవర్గం గట్టు మండల కేంద్రంలో అంబా భవాని దేవస్థాన కమిటీ హాల్లో శుక్రవారం మహబూబ్ నగర్– హైదరాబాద్ – రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై నిర్వహించిన మండల స్థాయి పార్టీ శ్రేణుల సమావేశానికి హాజరై, పట్ట భద్రుల ఓటర్ నమోదు ప్రాము ఖ్యతను వివరిస్తూ దిశా నిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లా డుతూ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి ప్రతి ష్టాత్మకమైనవని అర్హులైన ప్రతి ఓటరుగా నమోదయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వ యంతో పనిచేయాలని తెలిపారు. ఓటరు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరిని బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసేలా అవగాహన కల్పించాలని ఓటరు నమోదు ప్రక్రియలో పార్టీ శ్రేణులు నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. పట్టబద్రులు ఓటు నమోదు చేసుకునేందుకు నియోజక వర్గంలోనీ పలు ప్రాంతాలలో ఉచిత ఓటర్ నమోదు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారుఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు అమూల్యమైనదేనని,బీఆర్ఎస్ శ్రేణులు ప్రతి గ్రాడ్యుయేట్స్ ను కలిసి ఓటు నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు,ఉప సర్పంచులు,పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,యూత్ సభ్యులు పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి నివారణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

- తెలంగాణ ఉద్యమకారులకు అవకాశం కల్పించాలి.
- ప్రతి మండలంలో ఒక టీం బృందాలను ఏర్పాటు చేయాలి.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు లకు విజ్ఞప్తి.
- మీసాల రామన్న - తెలంగాణ ఉద్యమ కళాకారుడు

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో, ప్రజలకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో తెలంగాణ ఉద్యమ కళాకారులకు అవకాశం కల్పించాలని, తెలంగాణ ఉద్యమ కళాకారుడు మీసాల రామన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాటలు, ఆటలు, జానపద కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యపరిచిన ఉద్యమ కళాకారులు, రాష్ట్ర సాధన కోసం తమ కలనే ఆ విధంగా మల్చుకొని పోరాటం చేసిన తెలంగాణ ఉద్యమకారులు, నేడు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలానికి ఒక తెలంగాణ ఉద్యమ కళాకారుల బృందాన్ని ఏర్పాటు చేసి, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే విధంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సాంస్కృతిక సారథి కళాకారులతో పాటు తెలంగాణ ఉద్యమ కళాకారులకు కూడా సముచిత ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. ఉద్యమ కళాకారుల సేవలను గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పించాలని మీసాల రామన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విశ్వం అక్షర కాన్సెప్ట్ స్కూల్ లో సురక్షిత్ బచ్పన్ అభియాన్ అవగాహన సదస్సు

గద్వాల (ప్రజా జ్యోతి) అక్టోబర్ 30:

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి విశ్వం అక్షర కాన్సెప్ట్ స్కూల్లో శుక్రవారం సురక్షిత్ బచ్పావ్ అభియాన్ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమానికి గద్వాల సీనియర్ సివిల్ జడ్జి,జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రతినిధి జీ.నిష్కా పాత్రుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల రక్షణ,బాల్య వివాహాల నివారణ,బాలలపై లైంగిక దాడుల నుంచి రక్షణ,చట్టపరమైన హక్కులు మరియు అందుబాటులో ఉన్న లీగల్ సర్వీసెస్ గురించి అవగాహన కల్పించారు.పిల్లలు తమ హక్కులను తెలుసుకొని,ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమం పాఠశాల కరస్పాండెంట్ పత్తి శ్రీధర్,ప్రిన్సిపల్ రతన్ కుమార్ మరియు పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి గోపిక నాగశ్రావ్య

నాగర్ కర్నూల్ : అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో శుక్రవారం నాగర్కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నందు సురక్షిత్ బచ్ పన్ అభియాన్- ఏ-పాన్ ఇండియా స్కూల్ అవేర్నెస్ క్యాంపెయిన్ గురించి విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జ్ గోపిక నాగ శ్రావ్య హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ సురక్షిత్ బచ్పన్ అభియాన్ అనేది భారతదేశంలో పిల్లల రక్షణ,హక్కులు మరియు వారి భద్రతను పెంపొందించడం కోసం ఉద్దేశించిన ఒక ముఖ్యమైన కార్యక్రమని,చిన్న పిల్లలపై జరిగే లైంగిక దాడులు,వేధింపులను అడ్డుకోవడం కోసం ఏర్పాటైన పోక్సో చట్టంపట్ల విద్యార్థులకు,ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు.ప్రతి బిడ్డ స్వేచ్ఛగాచదువుకునే,ఆడుకునే సురక్షితమైన వాతావరణా న్ని అందించడం,విద్యార్థులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ గురించి వివరించిన అనంతరం బాలల క్షణకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వన్యాయవాది శ్రీరామ్ ఆర్య, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుదర్శన్,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి తెగుళ్ళపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ధనుక కంపెనీ డీజీఎం రమణ

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.

మండల కేంద్రంలో శుక్రవారం వరి పంటలో సుడిదోమ కాండం తొలుచు పురుగు మరియు కొంకర తెగుళ్లల నివారణ కోసం తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై ధనుక కంపెనీ డీజీఎం రమణ రైతులకు అవగాహన కల్పించారు వరి చిరు పొట్ట దశలో ఉన్నప్పుడు పురుగు ఆశిస్తుందని దానివల్ల తెల్ల కంకి ఏర్పడుతుందని తెలిపారు ఆ సమయంలోనే మోటార్ మందులు పిచికారి చేయాలని తెలిపారు సుడి దోమ నివారణ కోసం అప్లై మందులు వారం పది రోజుల్లో చేను మొదల వరకు తడిచేలా రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో కంపెనీ సీనియర్ మేనేజర్ పూర్ణచందర్ రావు ఎస్ ఓ ఎం ఏ రజాక్ డిడీవో విష్ణువర్ధన్ రెడ్డి వీరబాబు లక్ష్మణ్ చందు డీలర్ ఈశ్వరయ్య తదితరులున్నారు.

మంత్రి సొంత మండలానికే కరువు గుర్తింపు లేదా

- సొంత మండలం చిన్నంబావిపై అధికారుల నివేదికలేంటి?

- ఎండిపోయిన పంటలను పరిశీలించిన సీపీఎం బృందం

- రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి: ఎం.డి. జబ్బార్

చిన్నంబావి, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి, పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం వనపర్తి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి. జబ్బార్ డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఎండిపోయిన పంటలను సీపీఎం నాయకుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది.వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటల సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని తెలిపారు.మంత్రి సొంత మండలమైన చిన్నంబావిని సైతం కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడం రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రైతులు పంటలు కోల్పోయి తీవ్ర ఆవేదనలో ఉంటే ప్రభుత్వం కరువు పరిస్థితులను గుర్తించి సహాయక చర్యలు చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు.తక్షణమే చిన్నంబావి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందించాలని, పంట రుణాలు మాఫీ చేయాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి. బాల్ రెడ్డి, చిన్నంబావి మండల కార్యదర్శి వెంకటేష్, ఎం. ఆది, ఖాజా, రవి, వెంకటస్వామి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

విజవంతమైన ఉచిత కంటి శిబిరం

- 55 మందికి కంటి పరీక్షలు - 20 మందికి కంటి ఆపరేషన్లు

- జిల్లా ఉప వైద్యాధికారి భరత్ కుమార్ రెడ్డి

నాగర్ కర్నూల్ : అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనం102 గది లో నిర్వహించిన కంటి చికిత్స శిబిరం విజయవంత మైనట్లు జిల్లా ఉపవైద్యాధి కారి డాక్టర్.భరత్ కుమార్ రెడ్డి తెలిపారు.ఈ శిబిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 55 మందికి కంటిపరీక్షలు నిర్వ హించగా, అందులోఅర్హులైన క్యాట రాక్ట్ పొరగల 20 మందిని గుర్తించి ప్రత్యేక అంబులెన్స్ ద్వారా మహబూబ్నగర్ లోని లయన్ రాంరెడ్డి కంటిఆసుపత్రికి పంపినట్లు ఆయన తెలిపారు.రోగులకు శిబిరంలో ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించి సూచనలు చేసి మందులు అందజేశారు.ప్రతి ఒక్కరు జీవితకాలం కంటిచూపునుకలిగి ఉండుటకు ప్రతి రోజు నిత్యభోజనంలో విటమిన్-ఏ తో కూడిన క్యారెట్,ఆకుకూరలు,చేపలు, ఆహార పదార్థాలు అధికమొత్తంలో తినాలన్నారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ, పోతుల సుకుమా రెడ్డి,హెల్త్ ఎడ్యుకేటర్ ఓరుగంటి.శ్రీనివాస్,బాదం రాజేష్ పాల్గొన్నారు.

డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుల రాణి సేవలు అభినందనీయం

నాగర్ కర్నూల్ : అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో డిప్యూటీ నర్సింగ్ సూపర్డెంట్ గా విధులు నిర్వహిస్తున్న కె.మంజుల రాణి పదవీ వి మణ సందర్భంగా శుక్రవారం ఆసుపత్రి ఆవరణలో ఆత్మీయ పదవి విరమణ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుప్రియ శాలువలతో ఘనంగా సత్కరించారు.36 సంవత్సరాలు ఆరోగ్య శాఖలో విధులు నిర్వహించి వివిధ స్థాయిలో నేటి వరకు చేసిన సేవల పట్ల వైద్యులు,నర్సింగ్ అధికారులు ఆమె సేవలను కొనియాడారు.స్టాఫ్ నర్స్ గా నాగర్ కర్నూల్ సివిల్ ఆసుపత్రిలో విధుల్లోచేరి డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్గా పదవి విరమణ కావడం ఎంతో అదృష్టమన్నారు.గ్రామీణస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పలు అవార్డులు అందుకున్న తీరును పలువురూ వైద్యులు,అధికారులు,సిబ్బంది ప్రశంసించారు.గతంలో అక్షరాస్యత,సమాజంలో నెల కొన్న మూఢనమ్మకాలు, ఆరోగ్య సేవల శాస్త్రీయతను,కరోనా సమయంలో చేసిన ఆరోగ్య సేవలను పలువురు గుర్తుచేసి అభినం దించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు జనార్ధన్,వివిధ విభాగాల ప్రొఫెసర్లు డా.ఉమాకాంత్, డా.శ్రీకాంత్,ఆర్.ఎమ్ డాక్టర్.అజీమ్,నర్సింగ్ సూపరింటెండెంట్ సంగీత,డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్ పేర్సీ సుమన్,సాలేహా,నాగవేణి,ఉప సంచాలకులు సీ.జే.వసంత్ కుమార్,నర్సింగ్ అధికారులు,బంధుమిత్రులు,సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా పై మైక్రోస్కోపిక్ పునఃచరణ శిక్షణ

- ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజశేఖర్

నాగర్ కర్నూల్ : అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

మైక్రోస్కోప్ ద్వారా మలేరియా సూక్ష్మ క్రిమిని గుర్తించడంపై నాగర్ కర్నూల్ జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్ లకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించినట్టు ప్రోగ్రాం అడిగారు డాక్టర్.రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ల్యాబ్ టెక్నీషియన్లకు ఒకరోజు శిక్షణా తరగతులను నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి డాక్టర్.రాజశేఖర్ మాట్లాడుతూ అనుమానిత రోగి యొక్క రక్త నమూనాలను మైక్రో స్కోప్లో పరీక్షించడం ద్వారా వందశాతం కచ్చితంగా మలేరియా సూక్ష్మ క్రిమి ప్లాస్మోడియంను గుర్తించ వచ్చని,మలేరియా సూక్ష్మ క్రిమిలో రకాలైన ప్లాస్మోడియం వైవాక్స్,ప్లాస్మోడియం ఫాల్సిఫారం లోఉన్న విభేదాలను కచ్చితంగా గుర్తించడంపై శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్.రవికుమార్,కల్యాణ్ కృష్ణ,వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత.!

- పోక్సో చట్టంపై విద్యార్థులకు న్యాయ అవగాహన

- జిల్లాలోని పలు పాఠశాలల్లో 'సురక్షిత్ బచ్చన్ అభియాన్' కార్యక్రమాలు

మహబూబ్‌నగర్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి బ్యూరో):

బాలల హక్కుల పరిరక్షణ, లైంగిక వేధింపుల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'సురక్షిత్ బచ్చన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 28న జిల్లాలోని పలు పాఠశాలల్లో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు.మహబూబ్‌నగర్‌లోని ఏదిర, ఎనుగొండ, శాశబ్‌గుట్ట జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఎనుగొండ కేజీబీవీ, జడ్చర్ల జెడ్పీ ఉర్దూ మీడియం పాఠశాల, ప్రజ్ఞ హైస్కూల్‌లో విద్యార్థులకు పోక్సో చట్టం--2012, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, లైంగిక వేధింపుల నివారణపై అవగాహన కల్పించారు. పిల్లలు తమకు ఎదురయ్యే అనుచిత ప్రవర్తనను గుర్తించి భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కీలకపాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో డీఎల్ఎస్ఏ కార్యదర్శి డి.ఇందిర, న్యాయమూర్తులు మొహమ్మద్ మునవార్, మొహమ్మద్ ముదసిర్, ఆర్.అనిత, న్యాయవాదులు, పోలీసు అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

– "నాయకుడు దూరమైనా... ఆయన ఆశయాలు సజీవం.! గురువు చూపిన బాటలో శిష్యుడి ప్రస్థానం.!"

గురువు చూపిన బాటలో శిష్యుడి ప్రస్థానం.!

- గురువు ఆశయాలకు శిష్యుడి వారసత్వం... రాజేశ్వర్ రెడ్డి స్ఫూర్తితో ఎం.ఎస్.ఆర్ ప్రస్థానం.!
- ప్రజాసేవలో రాజేశ్వర్ రెడ్డి ఆశయాల కొనసాగింపు... మారేపల్లి సురేందర్ రెడ్డి
- 15వ వర్ధంతి సభలో సీనియర్ న్యాయవాది వి. మనోహర్ రెడ్డి వ్యాఖ్యలు...

మహబూబ్‌నగర్ అక్టోబర్ 30, (ప్రజా జ్యోతి బ్యూరో): రాజకీయాల్లో పదవులు రావడం ఒక ఎత్తయితే... ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకోవడం మరో ఎత్తు. అధికారం, హోదాలతో సంబంధం లేకుండా ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం నిజమైన ప్రజాసేవకు నిదర్శనం. అటువంటి సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న పాలమూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి (ఎం.ఎస్.ఆర్) ప్రస్తావన దివంగత మాజీ ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేకంగా వినిపించింది.

రాజేశ్వర్ రెడ్డి స్థానంలో భగవంతుడు సురేందర్ రెడ్డిని ఇచ్చారు.!

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని చారిత్రక గడియారం చౌరస్తా వద్ద నిర్వహించిన దివంగత మాజీ ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వి. మనోహర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సభికుల దృష్టిని ఆకర్షించాయి. రాజేశ్వర్ రెడ్డి మన మధ్య లేకపోయినా, ఆయన స్థానంలో భగవంతుడు మారేపల్లి సురేందర్ రెడ్డి రూపంలో మరో నాయకుడిని అందించారని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు గురుశిష్యుల రాజకీయ అనుబంధాన్ని, ప్రజాసేవ పట్ల వారికున్న అనుబంధాన్ని గుర్తుచేశాయి.

గురువు నేర్పిన రాజకీయ పాఠాలు... ప్రజాసేవలో శిష్యుడి అడుగులు.!

దివంగత రాజేశ్వర్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో చూపిన ఆప్యాయత, అందించిన ప్రోత్సాహం, నేర్పిన రాజకీయ మెలకువలను ఎప్పటికీ మరచిపోలేనని డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. క్రమశిక్షణ, ప్రజలతో మమేకమయ్యే తత్వం, ప్రజా సమస్యలపై స్పందించే గుణం తన రాజకీయ గురువు నుంచి నేర్చుకున్నానని తెలిపారు. రాజకీయాల్లో చురుకుదనం ఎంత ముఖ్యమో, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములు కావడం కూడా అంతే ముఖ్యమనే సందేశాన్ని ఆయన తన ప్రస్థానం ద్వారా తెలియజేస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆపదలో అండగా నిలవడమే అసలైన నాయకత్వం.!

ప్రజాప్రతినిధిగా తనకు ఉన్న బాధ్యతను కేవలం పదవికే పరిమితం చేయకుండా, అవసరంలో ఉన్నవారికి తన వంతు సహాయం అందించడం, బాధిత కుటుంబాలకు అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే దృక్పథం మారేపల్లి సురేందర్ రెడ్డిలో కనిపిస్తోందని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడం, అందుబాటులో ఉండడం, ఆపదలో ఉన్నవారికి చేతనైన సహాయం చేయడం వంటి అంశాలు ప్రజాప్రతినిధుల సామాజిక బాధ్యతను గుర్తుచేస్తాయి. ఈ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తూ ముందుకు సాగితే ప్రజలతో ఆయనకున్న అనుబంధం మరింత బలోపేతం కావడానికి అవకాశం ఉంటుంది.

పేరు మారినా... ప్రజాసేవ ఆశయం ఒక్కటే.!

రాజేశ్వర్ రెడ్డి ప్రజల మధ్య లేకపోయినా, ఆయనతో అనుబంధం కలిగిన వారు గుర్తుచేసుకుంటున్న సేవా విలువలు నేటికీ ప్రస్తావనకు వస్తున్నాయి. గురువు చూపిన మార్గదర్శకత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ మారేపల్లి సురేందర్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించాల్సిన బాధ్యతను ఈ వర్ధంతి మరోసారి గుర్తుచేసింది. నాయకుడి అసలైన వారసత్వం ఆయన వదిలివెళ్లిన పదవుల్లో కాదు... ప్రజల కోసం ఆయన చేసిన పనుల్లో ఉంటుందనే మాటకు ఈ గురుశిష్యుల అనుబంధం ఒక సందర్భాన్ని గుర్తుచేస్తోంది. రాజేశ్వర్ రెడ్డి ఆశయాల స్ఫూర్తి... సురేందర్ రెడ్డి ప్రజాసేవా ప్రస్థానం... పాలమూరు రాజకీయాల్లో ఈ అనుబంధం మరోసారి చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని దివంగత రాజేశ్వర్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

13 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడమేనా

– రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకునేటప్పుడు..?

– నారాయణపేట జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు వెంకట్రాములు ముదిరాజ్

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): ఎల్ ని నో ప్రభావంతో పంటలు ఎండిపోయి రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, నారాయణపేట జిల్లాలో 13 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం బాగుంది కానీ రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకునేది ఎప్పుడు అని నారాయణపేట జిల్లా బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షులు వెంకట రాములు ముదిరాజ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎలినో ప్రభావం తీవ్రంగా ఉందని దీంతో సాగుచేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయని, కనీసం పశువులకు మేత కూడా లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెట్టి రైతన్న ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని అన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించకుండా ప్రకటనల వరకే పరిమితమై రైతులకు ద్రోహం చేస్తుందని ఆయన విమర్శించారు. నారాయణపేట జిల్లాలో 13 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం బాగానే ఉంది కానీ పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని దుయ్యబట్టారు. కేవలం కరువు మండలాలుగా ప్రకటిస్తే సరిపోదని రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరా పత్తికి 40 వేలు,వరికి 25000, కంది పంటకు 20,000 ఎకరా మొక్కజొన్నకు 25000 చొప్పున వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. వర్షాలు లేక చెరువులు నిండక భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దానికి తోడుగా ఆ ప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఈ పరిస్థితి ఇలా ఉంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓట్ చోరీ పేరుతో రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటు అన్నారు. ఢిల్లీలో ధర్నాల పేరిట ప్రజల దృష్టిని మరలించాలని చూడడం కాంగ్రెస్ పార్టీ నాయకుల అవివేకం అన్నారు. ఇప్పటికే ఇటీవల నాలుగు రాష్ట్రాలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా

ఇవ్వకుండా ప్రజలు తగిన బుద్ధి చెప్పిన వారికి బుద్ధి రాకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలు తీర్చే నాయకులను నమ్ముతారు తప్ప,కల్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు దండుకోవాలని చూసే నాయకులకు ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారని అన్నారు.

రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం!

- సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్..

రూ.2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ

- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి బ్యూరో):

రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన రైతులకు రూ. 2 లక్షల వరకు ఏకకాలంలో పంట రుణమాఫీ అమలు చేయడంతో పాటు, సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, కొనుగోళ్లలో పారదర్శకత పాటించి ప్రతి ధాన్యం గింజకు గిట్టుబాటు ధర అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పేదలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు రేషన్ కార్డుదారులకు ప్రతి ఒక్కరికీ నెలకు ఆరు కిలోల సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు సంక్షేమం, పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు ప్రశాంత్, రమేష్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, పీర్ మహ్మద్ సాధిక్, మార్కెట్ యార్డు కార్యదర్శి అనిత తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా భూత్పూర్‌ను ప్రకటించాలి.!

- ;ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలి.. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరుబాట

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే రైతులకు ఈ దుస్థితి -- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

మహబూబ్ నగర్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి బ్యూరో):

వర్షాభావ పరిస్థితులతో పంటలు నష్టపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, భూత్పూర్ మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భూత్పూర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఈ ఆందోళనలో పాల్గొని రైతులకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ భూత్పూర్ మండలంలో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. భూత్పూర్ మండలంతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు. యాసంగి సాగు చేయొద్దని, నీళ్లు, కరెంట్ అడగొద్దని చెబుతున్నారని, మరి వ్యవసాయంపైనే ఆధారపడి జీవించే రైతులు ఎలా బతకాలని ప్రశ్నించారు. రైతులను సాగుకు దూరం చేయాల్సిన పరిస్థితి వస్తే వారికి తగిన ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కృష్ణా జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, జూరాల, కేఎల్ఐ ఆయకట్టు పరిధిలో పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. కాలంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలు కూడా రైతుల కష్టాలకు కారణమయ్యాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పెద్ద మనసుతో స్పందించాలని, కరువు పరిస్థితులను గుర్తించి ఎకరాకు రూ. 50 వేల పరిహారం అందించేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి తక్షణమే నష్టపరిహారం ప్రకటించకపోతే వారి ఆర్థిక పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

“క్రీడలకు పాలమూరు వేదిక.. యువ క్రీడాకారుల ప్రతిభకు కొత్త అవకాశం.!”

- మహబూబ్‌నగర్‌లో ఇండియా యూత్ గేమ్స్

-2026కు సన్నాహాలు.!

- క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలి..

అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి బ్యూరో):

మహబూబ్‌నగర్ జిల్లాలో 8వ ఎడిషన్ స్టేట్ ఇండియా యూత్ గేమ్స్--2026ను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ క్రీడా పోటీలకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం మెయిన్ స్టేడియం గ్రౌండ్‌లో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన మైదానాల అభివృద్ధి, మరమ్మతులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలు, రవాణా తదితర అంశాలపై చర్చించారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ సూచించారు. 8వ ఎడిషన్ స్టేట్ ఇండియా యూత్ గేమ్స్--2026ను మహబూబ్‌నగర్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారులు, ఆర్ అండ్ బీ శాఖ ఇంజినీర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం.....

నూతన ఇందిరమ్మఇంట్లో గృహప్రవేశం

మహ్మదాబాద్ అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

మండలంలోని మంగంపేట తండాలో శుక్రవారం బుజ్జి బాయి లక్ష్మణ్ దంపతుల నూతన ఇందిరమ్మ గృహప్రవేశం జరిగింది. ఈ గృహప్రవేశం కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే ఎం నారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబా నికి సొంత ఇల్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోపాల్ నాయక్,మాజీ ఎంపీపీ శాంతి రంగ్యా,జిల్లా కార్యవర్గ సభ్యులు అనంతయ్య, జనరల్ సెక్రటరీ నరసింహా రెడ్డి,సర్పంచ్ రాకేష్, సర్పంచ్ అంజ్యా నాయక్,మాజీ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ రహీం,యువజన కాంగ్రెస్ కార్యదర్శి జి లక్ష్మీకాంత్ రెడ్డి, మోతీ రామ్,సునీల్,శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి మండల సర్వసభ్య సమావేశం

- చిన్నంబావిలో పలు శాఖల అధికారులు సర్పంచులు గైర్హాజరు

- ఎల్ నినో ప్రభావంపై రైతులకు ముందస్తుఅవగాహన కల్పించాలి

- మండల స్పెషల్ ఆఫీసర్ డిపిఓ రఘునాథ్ రెడ్డి

చిన్నంబావి, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాల్సిన సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు సర్పంచులు, గైర్హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు లేవ నెత్తే సమస్యలకు సమాధానాలు ఇవ్వాల్సిన అధికారులే సమావేశానికి రాకపోవడంతో సమీక్ష లక్ష్యం ప్రశ్నా ర్థకంగా మారింది. వనపర్తి జిల్లా చిన్నంబావి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమా వేశంలో ఈ పరిస్థితి కనిపించింది. మండల ప్రత్యేక అధికారి మండల స్పెషల్ ఆఫీసర్ రఘునాథ్ రెడ్డి సమావేశానికి హాజరయ్యారు.

పలు శాఖల అధికారులు సర్పంచులు గైర్హాజరు

వ్యవసాయ, రెవెన్యూ, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, విద్య, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ, విద్యుత్, మిషన్ భగీరథ, నీటిపారుదల, ఐకేపీ, ఉపాధి హామీ, అరండ్, గృహ నిర్మాణ శాఖల అధికారులు పాల్గొన్నారు. అటవీ, ఉద్యానవన, ఎక్సైజ్, మత్స్య, రెవెన్యూ, పోలీస్, పట్టు పరిశ్రమ శాఖల అధికారులు హాజరుకాలేదు. వివిధ శాఖల పరిధిలోని సమస్యలు, పెండింగ్ పనులు, ప్రభుత్వ పథకాల అమలుపై సమగ్ర సమాచారం అందించాల్సిన అధికారులు గైర్హాజరు కావడం చర్చనీయాంశం అయింది.

ప్రజా సమస్యలపై చర్చలేవీ?

గ్రామాల్లో ముఖ్యంగా తాగునీటి సరఫరా, విద్యుత్, పారిశుధ్య నిర్వహణ, వ్యవ సాయం, ఇతర రహదారులు,, సాగునీరు, విద్య, వైద్యం, గృహ నిర్మాణాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీ క్షించడం సమావేశాల ప్రధాన ఉద్దేశం. గత సమా వేశాల్లో ప్రస్తావించిన సమస్యల పరిష్కార పురోగతి, పెండింగ్ పనుల స్థితి, వాటి పూర్తికి నిర్ణయించిన గడువుపై సమీక్ష జరగాలి. ఆయా అంశాలపై సమగ్ర చర్చకు అవకాశం ఎలా లభిస్తుందని పలువురు సభ్యులు వాపోయారు. అధికారులు నిర్ణీత సమయానికి సమా వేశాలకు హాజరై తమ శాఖల వివరాలను వెల్లడిం చాలి. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాలి. గైర్హాజరైన అధికారుల నుంచి వివరణ తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు అభిప్రాయపడ్డారు.. సర్పంచులు లేవనెత్తిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు స్పందిస్తూ తగిన వివరణలు ఇచ్చారు. కొన్ని సమస్యలను క్షేత్రస్థాయి పరిశీ లనద్వారాత్వరలోనే పరిష్కరిస్తామని, సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయిన పనులను త్వరితగతిన పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు.అలాగే ఏపీఓ ధనుంజయరాజు మాట్లాడుతూ.. కరోనా సమయంలో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించిన విధంగానే ప్రస్తుతం కూడా పనులు కల్పిస్తామని తెలిపారు. మ్యాజిక్ సోక్‌పిట్లు, ఇంకుడు గుంతలు, బోరుబావుల రీఛార్జ్, కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టి కాలువలు ఇతర పనులు కూలీలకు ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు.

పక్క మండలం వీపనగండ్లకు కరువు గుర్తింపు.. చిన్నంబావికి ఎందుకు లేదు?

మంత్రి సొంత మండలానికే అన్యాయం.. సర్పంచుల మండిపాటు చిన్నంబావి పక్కనే ఉన్న వీపనగండ్ల మండలాన్ని కరువు మండలంగా గుర్తించి, చిన్నంబావిని విస్మరించడంపై వివిధ గ్రామాల సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో వర్షాభావంతో పంటలు ఎండిపోయి రైతులు పెట్టుబడులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి సొంత మండలానికే కరువు గుర్తింపు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే చిన్నంబావిని కరువు మండలంగా ప్రకటించి రైతులకు పరిహారం అందించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి మండలవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎల్ నినో పై రైతులకు అవగాహన కల్పించాలి.

మండల స్పెషల్ ఆఫీసర్ డిపిఓ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో వ్యవసాయ రంగానికి ఎదురయ్యే ముప్పును వివరించడం ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగు, నీటి వినియోగం, వ్యవసాయ నిర్వహణపై రైతులకు శాస్త్రీయ సూచనలు అందించాలని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థా యిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహి ంచాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులపై ముం దస్తు సమాచారం అందితే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీలు, సర్పంచులు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అభివృద్ధి సమావేశాలు ఆచరణలో ఫలించాలి

సర్వసభ్య సమావేశాలు కేవలం హాజరు నమోదు, చర్చలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి దోహద పడాలని సభ్యులు కోరారు. ప్రతి శాఖ అధికారి హాజరై సమస్యలపై స్పష్టత ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి గడువు నిర్ణయించి, తదుపరి సమావేశంలో పురోగతిని సమీక్షించాలని చెప్పారు. అప్పుడే సమావేశాల నిర్వహ ణకు సార్థకత చేకూరుతుందన్నారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు.పెద్దమారూర్ సర్పంచ్ కేతపాగ జయమ్మ, చిన్నంబావి సర్పంచ్ దివ్యశ్రీ, చిన్న మారు సర్పంచ్ శంకర్, కొప్పునూరు సర్పంచ్ వడ్డెమ్మని బిచ్చన్న, గంగాధర్, చెల్లెపాడు సర్పంచ్ పెద్ద నరసింహ, గూడెం సర్పంచ్ కొత్త వెంకటరెడ్డి, బెక్కెం సర్పంచ్ కమాలబాయి,కాలూర్ సర్పంచ్ లీలతమ్మ పెద్ద దగ్గర సర్పంచ్ భాస్కర్ అధికారులు ఎంపీడీవో ఆదర్శ్ గౌడ్, ఎంపీఓ రామస్వామి, ఏపీవో ధనుంజయ రాజు, ఎంఈవో, ఏవో దాకేశ్వర్ గౌడ్, ఏఈ అప్పలనాయుడు, ఇరిగేషన్ ఏఈ జాషువా,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిన్నంబావిని కరువు మండలంగా ప్రకటించాలి:మాజీ జెడ్పీటీసీ

- పక్క మండలాలకు గుర్తింపు..

మంత్రి సొంత మండలానికి ఎందుకు లేదు?

- అధికారుల నివేదికలపై మాజీ జెడ్పీటీసీ

వెంకటరమణమ్మ, చిన్నారెడ్డి డిమాండ్

చిన్నంబావి, అక్టోబరు 29 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండలంలో కరువు పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో చోటు కల్పించకపోవడంపై మాజీ జెడ్పీటీసీ కేశిరెడ్డి వెంకటరమణమ్మ, బీఆర్ఎస్ నాయకుడు చిన్నారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత మండలమైన చిన్నంబావిని విస్మరించడం ఏమిటని ప్రశ్నించారు. పక్కనే ఉన్న వీపనగండ్ల, పెబ్బేరు మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించి చిన్నంబావికి ఎందుకు గుర్తింపు ఇవ్వలేదని నిలదీశారు.మండలంలో సాగైన పంటల విస్తీర్ణం, ఎల్‌నినో ప్రభావంతో ఎండిపోయిన పంటలు, భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్తు సమస్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారా? అని ప్రశ్నించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకోలేదా? నివేదికల్లో లోపాలున్నాయా? అని సందేహం వ్యక్తం చేశారు. అధికారులు సమగ్రంగా పరిశీలించి చిన్నంబావిని కరువు మండలంగా ప్రకటించాలని, నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

ప్రతిభకు గుర్తింపు..........

ఆర్థిక సాయం అందజేసిన పరిగి ఎమ్మెల్యే.....

మహమ్మదాబాద్ అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

పేదరికంలో ఉన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు సాయం చేయడంలో ముందుంటానని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. టి ఆర్ ఆర్ మెడికల్ కాలేజీలో కే శ్రీవాణి ఎంబిబిఎస్ సీట్ సాధించినందుకు గాను విద్యార్థినికి 60 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గంలోని ఉన్నప్రజలకు విద్యా వైద్య పరంగా సాయపడటంలో అందరికీ అందుబాటులో ఉంటానని నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలోమహమ్మాదాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ మాజీ ఎంపీపీ శాంతి రంగ్యా, ఉపసర్పంచ్ రవి నాయక్, బాల్య తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించండి సారూ.... రైతుల కష్టాలు కనిపించడం లేదా?

- ఎం ఆర్ ఓ కు వినతి పత్రం అందజేసిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు.

మహమ్మదాబాద్ అక్టోబర్ 30 అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

మహమ్మదాబాద్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ స్థానిక ఎమ్మార్వో కు మహ్మదాబాద్ మండల బిఆర్ఎస్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురకపోవడంతో చేతికొచ్చిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులు పంట ల పరిస్థితి చూసి ఆందోళన చెందుతున్నారని,ఒకవైపు ఎండలు మరోవైపు వర్షాల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇలాంటి పరిస్థితుల్లో రైతులనుఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు.మండలంలోని వ్యవసాయ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి కరువు మండలం గా ప్రకటించేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని ఎమ్మార్వోను కోరారు ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, గాదిరాల్ మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి,కేశవులు గీతా పాండు, రాజు తిరుమల్ రెడ్డి ఇతర టిఆర్ఎస్ నాయక్ పాల్గొన్నారు.

"తండ్రి నీడ దూరమైనా..

ఆయన జ్ఞాపకాలే జీవితాంతం మనకు కొండంత అండ.!"

- తండ్రి జ్ఞాపకాలకు కన్నీటి నివాళి..!

- ఆల రఘుపతి రెడ్డి వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

మనిషి దూరమైనా.. ఆయన జ్ఞాపకాలు మాత్రం చెరిగిపోవు!

మహబూబ్ నగర్ అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి బ్యూరో):

తండ్రి అంటే కుటుంబానికి ధైర్యం.. జీవితానికి దారి చూపే వెలుగు.. కష్టాల్లో అండగా నిలిచే ఆత్మీయత. అలాంటి తండ్రి భౌతికంగా దూరమైనా ఆయన జ్ఞాపకాలు మాత్రం కుటుంబ సభ్యుల హృదయాల్లో ఎప్పటికీ చెరిగిపోవు. ఈ భావోద్వేగానికి అద్దం పట్టేలా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తన తండ్రి స్వర్గీయ ఆల రఘుపతి రెడ్డి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలో ఏర్పాటు చేసిన తండ్రి విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తండ్రితో తనకున్న అనుబంధాన్ని, ఆయన జ్ఞాపకాలను స్మరించుకున్నారు.తండ్రి చూపిన మార్గం, నేర్పిన విలువలు, అందించిన ప్రోత్సాహం జీవితంలో ఎప్పటికీ మరువలేనివని చాటిచెప్పేలా ఈ నివాళి కార్యక్రమం సాగింది. కాలం గడిచినా కన్నవారి జ్ఞాపకాలు మనసులో సజీవంగానే ఉంటాయని ఈ కార్యక్రమం మరోసారి గుర్తుచేసింది. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు, కుటుంబ సభ్యులు, అన్నసాగర్ గ్రామస్థులు పాల్గొని స్వర్గీయ ఆల రఘుపతి రెడ్డికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తండ్రి భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆయన నేర్పిన జీవిత పాఠాలు, అందించిన ప్రేమ, చూపిన మార్గం కుమారుడి జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోతాయనడానికి ఈ వర్ధంతి నివాళి ఒక భావోద్వేగ జ్ఞాపకం.

పట్టా చేతిలో ఉంటే సరిపోదు.. ప్రజాస్వామ్యంలో పట్టభద్రుడి ఓటు హక్కు కూడా కీలకమే.!

- పట్టభద్రుల ఓటరు నమోదుపై మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ దృష్టి!

- నవంబర్ 6లోగా అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది -- మాజీ మంత్రి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి బ్యూరో):
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పార్టీ శ్రేణులు బాధ్యతగా తీసుకుని విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాల, వాసవి డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడి ఓటరు నమోదుపై వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అవసరమైన నోటిఫికేషన్లు విడుదల చేయడంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత తమ అసంతృప్తిని ఓటు ద్వారా తెలియజేస్తుందని వ్యాఖ్యానించారు. జిల్లాలో పట్టభద్రుల ఓటరు నమోదు తక్కువగా ఉందని, డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ నవంబర్ 6వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. గత ఎన్నికల్లో ఓటు వేసిన వారు సైతం ప్రస్తుత ఎన్నికల కోసం కొత్తగా నమోదు చేసుకోవాల్సి

ఉంటుందని తెలిపారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, డిగ్రీ మెమో జిరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని వివరించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఓటరు నమోదు కేంద్రాలను పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదే సందర్భంగా రాష్ట్రంలోని సాగునీరు, వ్యవసాయ పరిస్థితులపై స్పందిస్తూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, రైతుల బోర్లకు మీటర్లు పెట్టాలన్న కేంద్రం ప్రతిపాదనను అంగీకరించలేదని పేర్కొన్నారు. ప్రస్తుత కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే కారణమని విమర్శించారు. గతంలో కరువు పరిస్థితులను

ఎదుర్కొనేందుకు తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనిదినాల పెంపు, రుణమాఫీ, పశుగ్రాసానికి 50 శాతం సబ్సిడీ వంటి చర్యలు చేపట్టామని గుర్తుచేశారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, బీఆర్ఎస్వీ నాయకులు శివకుమార్, నవీన్ రాజ్, భరత్ఎ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై సమరశంఖం.!

- ఫ్లాష్ లైట్ల వెలుగులో మహబూబ్‌నగర్‌లో అవగాహన వాకథాన్

- ప్రజలంతా భాగస్వాములు కావాలి.. సైబర్ మోసాలకు చెక్ పెట్టాలి: జిల్లా ఎస్పీ జానకి

- అక్టోబర్ 31న సాయంత్రం 6 గంటలకు ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక కార్యక్రమం

మహబూబ్‌నగర్ అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి బ్యూరో):
రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలను చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా అక్టోబర్ 31వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని ట్యాంక్‌బండ్‌పై మొబైల్ ఫ్లాష్ లైట్లతో ప్రత్యేక వాకథాన్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి కోరారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్ల ఫ్లాష్ లైట్లు వెలిగిస్తూ ఈ అవగాహన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అప్రమత్తతే సైబర్ నేరాలకు అసలైన అడ్డుకట్ట.!

సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, నకిలీ లింకుల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ హెచ్చరించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్‌లు, ఓటీపీలు ఎవరికీ వెల్లడించవద్దని, గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైనప్పుడు భయపడకుండా, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

ఒక్కరి అప్రమత్తత.. కుటుంబానికి రక్షణ.!

సైబర్ నేరాల రహిత సమాజ నిర్మాణం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ ఫ్లాష్‌లైట్ వాకథాన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కావున మహబూబ్‌నగర్ పట్టణ ప్రజలంతా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా

పాల్గొని సైబర్ నేరాలపై సమాజానికి అవగాహన కల్పించడంలో భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ జానకి విజ్ఞప్తి చేశారు.

రైతన్న కన్నీటి గాథ.. రైతు కష్టం గొర్రెలపాలు

- అప్పుల ఊబిలో చిక్కుకున్న పెద్దమారూర్ కౌలు రైతు బి కృష్ణయ్య. కే కాసిం, శివకుమార్ శెట్టి

చిన్నంబావి, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి)

రైతు కష్టం నేలపాలు.. పెట్టిన పెట్టుబడి బూడిదపాలు! ఆరుగాలం శ్రమించి, అప్పులు చేసి, ఎన్నో ఆశలతో పంటలు సాగు చేసిన రైతన్నకు చివరకు కన్నీరే మిగులుతోంది. వర్షాలు సకాలంలో కురవకపోవడం, బోర్లలో నీరు లేకపోవడం, మరోవైపు విద్యుత్ సరఫరా సక్రమంగా అందకపోవడంతో చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామంలో పంటలు ఎండిపోతున్నాయి. చేతికందు తాయని ఆశించిన పంటలు కళ్ల ముందే వాడిపోతుండటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ప్రస్తుత పరిస్థితులు ఆర్థిక భారంగా మారుతున్నాయి.ఆరుగాలం చెమటోడ్చి, కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి కళ్ల ముందే ఎండుతుంటే ఆ రైతు గుండె పగిలిపోయింది. కంటి నిండా ఆశలతో, వేల రూపాయల కలలతో సాగు లోకిదిగిన కౌలు రైతుకు ప్రకృతి మోసం చేసింది. ఎల్ నినో ప్రభావంతో కష్టపడి సాగు చేసిన ఉల్లి, మొక్కజొన్న, వరి పంట పొలాన్ని ఎండిపోవడంతో రైతు కష్టం గొర్రెలపాలు పశువుల మేతగా వదిలే యాల్సిన దుస్థితి ఆ కుటుంబం పాలిట శాపంగా మా రింది. పెద్దమారూర్ గ్రామానికి చెందిన కేతపాగ కాసిం, బత్తుల కృష్ణయ్య , ఎల్ శివకుమార్ శెట్టి అనే సాధారణ కౌలు రైతు పడినవేదన ప్రతి ఒక్కరి చేత కంటతడి పెట్టిస్తుంది. కే కాశీం 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశారు. బత్తుల కృష్ణయ్య, 9 వరి ఎకరాలు 6 ఎకరాల ఉల్లి 2 ఎకరాల మొక్కజొన్న ఎల్ శివకుమార్ శెట్టి 8 ఎకరాల మొక్కజొన్న 2 ఎకరాల మినుములు 2 ఎకరాల వరి విత్తనాలు కొనడానికి, ట్రాక్టర్తో దున్నడానికి, ఎరువులు వేయడానికి, కూలీలకు డబ్బుల కోసం లక్షన్నర వరకు అప్పు చేసి పంటపై పెట్టుబడి పెట్టాడు. అయితే ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సక్రమంగా కురవలేదు. సాగునీరు అందక, ఎండల తీవ్రతకు వేల ఎకరాల పొలంలో వరి పైరు పచ్చదనాన్ని కోల్పో యి పూర్తిగా ఎండిపోయింది. పెట్టుబడి రాకపోగా, చేసిన అప్పులు ఎలా తీర్చాలనే దిక్కుతోచని స్థితిలో ఆ రైతు పడిన వేదన వర్ణనాతీతం. కళ్ల ముందే ఎండి పోతున్న పైరును చూసి తట్టుకోలేకపోయిన కాసిం, కృష్ణయ్య, శివకుమార్ శెట్టి చివరికి కన్నీళ్లతో పొలాన్ని గొర్రెల మేతగా వదిలేయాల్సి వచ్చింది. ఇప్పుడు ఈ అప్పులు ఎలా తీర్చాలి? మా బతుకులు రోడ్డున పడ్డాయి" అంటూ ఆ కౌలు రైతు కన్నీరుమున్నీరవుతున్న తీరు అందరినీ కలిచివే స్తోంది. ప్రకృతి ప్రకోపానికి గురవుతున్న ఇలాంటి నిరుపేద కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి,చిన్నంబావిని కరువు మండలంగా ప్రకటించాలి తగిన నష్టపరిహారం అందించి అదుకోవాలని స్థానికులు వివిధ గ్రామాల రైతులు కోరుతున్నారు.

తోటపల్లి పాఠశాలకు ఉపాధ్యాయుడిని తిరిగి పంపించాలి

- డీఈఓకు వినతిపత్రం అందజేసిన మాజీ ఉపసర్పంచ్ మట్ట నరేష్ గౌడ్, గ్రామస్తులు

కల్వకుర్తి,అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

తోటపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి తర్నికల్ తండాకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడిని తిరిగి తోటపల్లి ప్రాథమిక పాఠశాలకు పంపించాలని కోరుతూ నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.విద్యార్థుల విద్యాభ్యాసానికి ఇబ్బందులు కలగకుండా, ఉపాధ్యాయుడిని తిరిగి తోటపల్లి ప్రాథమిక పాఠశాలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని వారు డీఈఓను కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తమ విజ్ఞప్తిని పరిశీలించి, ఉపాధ్యాయుడిని తిరిగి అదే పాఠశాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మట్ట నరేష్ గౌడ్, వెంకటేష్, సురేష్, కృష్ణయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి రూ.50 వేల ఆర్థికసాయం

- మిత్రుడి పిల్లల భవిష్యత్తుకు అండగా పూర్వ విద్యార్థులు

- స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనం

చిన్నంబావి, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి)

స్నేహానికి మరణం లేదని నిరూపించారు ఆ పూర్వ విద్యార్థులు. చిన్ననాటి నుంచి కలిసి చదువుకుని, ఎన్నో మధుర జ్ఞాపకాలను పంచుకున్న మిత్రుడు దూరమైనా.. అతడిపై ఉన్న అభిమానం మాత్రం మరువలేదు. తోటి స్నేహితుడి కుటుంబం కష్టాల్లో ఉందని తెలుసుకుని అండగా నిలిచారు. తమ మిత్రుడి పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు.చిన్నంబావి మండలం కొప్పునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2010--11 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న కత్తి నాగరాజు జూన్ 3న మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ మిత్రుడి ఇద్దరు పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూ.50 వేల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం నాగరాజు కుటుంబ సభ్యులకు రూ.50 వేల నగదును అందజేశారు.ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి, స్నేహం అంటే కేవలం కలిసి చదువుకోవడం, సరదాగా గడపడమే కాదు.. కష్టసమయంలో తోడుగా నిలవడమని చాటిచెప్పారు. పూర్వ విద్యార్థుల ఔదార్యంపై పలువురు ప్రశంసలు కురిపించారు.

కబడ్డీలో సత్తా చాటిన విద్యార్థులు

- రాష్ట్రస్థాయి పోటీలకు మార్చాలనుంచి ఇద్దరి ఎంపిక

- నవంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో పోటీలు

కల్వకుర్తి,అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి):

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఇద్దరుమార్చాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పీఎం శ్రీ పాఠశాలల ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో నాగర్‌కర్నూల్‌లోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన ఎన్. కావేరి, ఓ. ధనుష్ రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించారు.రాష్ట్రస్థాయి పీఎం శ్రీ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు నవంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో జరగనున్నాయి. ఈ పోటీల్లో జిల్లా తరఫున ఎంపికైన క్రీడాకారులు పాల్గొననున్నారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు యాదయ్య గౌడ్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పిలుపు

కల్వకుర్తి అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి):
తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని జైపాల్ యాదవ్ సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. 2023 అక్టోబర్ 31వ తేదీ నాటికి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. ఇందుకోసం ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, ఫోటో, మొబైల్ నంబర్ వివరాలతో నవంబర్ 6వ తేదీలోగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో లేదా సంబంధిత అధికారులకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. బీఎల్ఓలు, సంబంధిత రెవెన్యూ అధికారుల సహకారంతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని జైపాల్ యాదవ్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ ఆచరణలోకి రాకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయలేదని, డీఏ బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన సుమారు రూ.8 వేల కోట్ల పీఎఫ్ బకాయిల అంశంలోనూ ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

రాజీవ్ యువ వికాసం పేరుతో యువతకు హామీలు ఇచ్చిన ప్రియాంక గాంధీ సైతం నిరుద్యోగులను నిరాశపరిచారని జైపాల్ యాదవ్ విమర్శించారు. ఆరు లక్షల మంది నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదని, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలం గడుపుతోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ చేపట్టిన ఉద్యోగ నియామకాల ప్రక్రియలో ఎంపికైన వారికి ఇప్పుడు నియామక పత్రాలు అందించి కాంగ్రెస్ ప్రభుత్వం తన ఘనతగా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు.

బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని పార్టీ శ్రేణులకు జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. మండల, గ్రామ, జిల్లా స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల తరఫున పోరాటం చేయాలని కోరారు.వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని అన్నారు. గతంలో వాణీదేవిని గెలిపించేందుకు పార్టీ శ్రేణులు ఏ విధంగా కృషి చేశాయో, అదే స్ఫూర్తితో రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ విజయం సాధించే దిశగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కల్వకుర్తి ప్రజల రుణం తీర్చుకుంటా

తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కల్వకుర్తి నియోజకవర్గ ప్రజల రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిదని జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ చివరి రక్తపు బొట్టు వరకు ప్రజాసేవకే అంకితమవుతానని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. విలేకరుల సమావేశంలో కాటన్ అధ్యక్షుడు సూర్యప్రకాష్ రావు,భావండ్ల మధు భీమ్లా నాయక్,భగత్ సింగ్,బాలయ్య, కిషోర్ ,రామకృష్ణ,విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల కోసం గ్రామ పంచాయతీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు!

- సర్పంచ్, కార్యదర్శిపై రైతు దామోదర్ గౌడ్ ఆరోపణలు

- కోళ్ల ఫామ్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నా తప్పని తిప్పలు

చిన్నంబావి, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి)

చిన్నంబావి మండల పరిధిలోని అమ్మాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో చిన్న పనులకు సైతం అనుమతులు పొందడం కష్టంగా మారిందని అమ్మాయిపల్లి గ్రామానికి చెందిన రైతు దామోదర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. తన వ్యవసాయ పొలంలోని కలపతో బొగ్గు తయారు చేసి విక్రయించుకునేందుకు అనుమతులు కోరగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అనుమతుల కోసం వినతిపత్రం సమర్పించినా స్పందించడం లేదని,వారు వేధిస్తున్నారని పేర్కొన్నారు.ఈ విషయమై చిన్నంబావి మండల అభివృద్ధి అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. మరోవైపు అమ్మాయిపల్లి గ్రామానికి చెందిన భాను ప్రకాష్ గౌడ్, తిరుపతయ్య గౌడ్ కోళ్ల ఫామ్ ఏర్పాటుకు సెప్టెంబర్ 10న దరఖాస్తు చేసుకున్నారని, వారికి కూడా అనుమతుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు.

అనుమతుల మంజూరులో జాప్యానికి కారణాలేమిటో అధికారులు వెల్లడించాలని బాధితులు కోరుతున్నారు. డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం అర్హులైన వారికి అనుమతులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేశారు.

ఆల్ ఇండియా సంగీత పోటీల్లో సత్తా చాటిన ఉపాధ్యాయుడు ఇద్రిస్

-అభినందించిన డి.ఈ.ఓ రమేష్ కుమార్

నాగర్ కర్నూల్ : అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ సంగీత పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు మహమ్మద్ ఇద్రిస్ ప్రతిభను చాటి భాషా సాంస్కృతిక శాఖ తరపున ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాల య అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక రవీంద్రభారతిలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ సంగీత పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ తరపున ఉపాధ్యాయుడు ఇద్రిస్ పాల్గొని సంగీత రంగంలో తన ప్రతిభను ప్రదర్శించి భాషా సాంస్కృతిక శాఖ తరపున ప్రశంసా పత్రాన్ని అందుకోవడం విశేషం.బిజినపల్లి మండలం వెల్గొండ గ్రామంఎమండల పరిషత్ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఇద్రిస్,విద్యాబోధనతో పాటు సంగీతంపై ఉన్న ఆసక్తి,అభిరుచితో పోటీల్లో పాల్గొనిప్రశంసలు అందుకున్నారు.జిల్లాలో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ రాష్ట్రస్థాయి వేదికపై జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించి ప్రశంసాపత్రం అందుకోవడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఆయన ప్రతిభను డిఇఓ రమేష్ కుమార్ అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.